
ముధోల్ మున్సిపాలిటీ కావాలే..

- తాలూకా కేంద్రంపై ఆశలు
- 18 వేలకు పైగా గ్రామ జనాభా
- రెండేళ్ల క్రితమే పాలకవర్గం తీర్మానం
- అప్పటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి విన్నపం

గ్రామం: ముధోల్	
జనాభా:	18 వేలు
కుటుంబాలు:	6 వేలు
వార్డులు:	16
ఆసుపత్రులు:	కమ్యూనిటీ వైద్యశాల
ప్రైవేటు ఆసుపత్రులు:	13
జూనియర్ కళాశాలలు:	02
ప్రైవేటు కళాశాలలు:	2
ప్రభుత్వ పాఠశాలలు:	2
పెట్రోల్ బంక్‌లు:	04
పంచాయతీ సిబ్బంది:	42
పంచాయతీ ట్రాక్టర్లు:	02
పంచాయతీ ఆటో:	01
పన్నుల ద్వారా పంచాయతీ ఆదాయం:	రూ. 16 లక్షలు


ముధోల్ గ్రామం

భైంసా: ముధోల్ మున్సిపాలిటీ కావాలే..అన్న డిమాండ్ పెరుగుతూ వస్తోంది. మరికొద్ది రోజుల్లోనే స్థానికసంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చాలని అంతా కోరుతున్నారు. ముధోల్ పంచాయతీలో 18 వేలు జనాభా ఉన్న ఇప్పటికి మున్సిపాలిటీ కాలేక ప్రత్యేక నిధులు రాక అభివృద్ధి కుంటుపడుతుంది.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో భైంసా మున్సిపాలిటీతోపాటు ఏడు మండలాలున్నాయి. చదువులమ్మ కొలువైన బాసర ట్రిపుల్ ఐటీ ఉంది. నియోజకవర్గ కేంద్రం తాలూకా ముధోల్‌లో ఏటా పెరుగుతున్న జనాభా, వారి భవిష్యత్ అవసరాల దృష్ట్యా మున్సిపాలిటీగా కావాలని ప్రజాప్రతినిధులు కోరుకుంటున్నారు. ముధోల్‌లో ఇప్పుడిప్పుడే వ్యాపారపరంగా పెరుగుతోంది. ఇక్కడ బట్టలు, నగలు, జనరల్ స్టోర్స్, కిరాణ, ఇలా అన్ని షాపులు ఉన్నాయి. ఇక్కడే ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాల, కేజీబీవీ, ఆదర్శ, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. సబ్ డివిజనల్ పోస్టాఫీసు, సహకార సంఘంతోపాటు ఐసీఐసీఐ, ఎస్బీఐ, టీజీబీ బ్యాంకులు సేవలందిస్తున్నాయి. పంచాయతీరాజ్, డివిజన్ కేంద్రం ఇక్కడే ఉంది. ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా విశాలమైన వ్యవసాయక్షేత్రం ఉంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇలా ప్రభుత్వపరంగా ఎన్నో సేవల కోసం నిత్యం వేలాదిగా ముధోల్‌కు రాకపోకలు చేస్తుంటారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాకతో..

2023 జనవరి 27న మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ ముధోల్ వచ్చారు. అప్పటి కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కాడే, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ముధోల్ తాజా మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్‌తోపాటు పలువురు ముధోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని చీఫ్ సెక్రటరీ సూచించారు. అప్పట్లోనే మున్సిపాలిటీగా ఏర్పడుతుందని ఆశ పెరిగింది. పంచాయతీ పాలకవర్గం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి పంపించినా ఇప్పటికి ఎలాంటి కదలిక లేదు.

మున్సిపాలిటీలకు అధిక నిధులు

గ్రామ పంచాయతీలకు నిధులు, సిబ్బంది అంతంతగానే ఉన్నా.. మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధిక నిధులు మంజూరవుతున్నాయి. ఈ నిధులతో రూపురేఖలు మారుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఫుట్‌పాత్‌లు, పార్కుల నిర్మాణం, విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు చేపడుతోంది. అదే ముధోల్ మున్సిపాలిటీగా ఏర్పడితే అభివృద్ధి జరగడంతో పాటు అన్నిశాఖల్లో అధికారులు, సిబ్బంది సంఖ్య పెరుగుతారు. ప్రతిరోజు జనంలో వారు ఉంటూ అవసరాల మేర పనులు చేసిపెడుతారు. ఇదిలా ఉంటే, 50 వేలలోపు జనాభా ఉన్న మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్‌కు రూ.15,600, వైస్ చైర్మన్‌కు రూ.6500, కౌన్సిలర్లకు రూ.3250 నెలనెల వేతనాలు చెల్లిస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచులకు నెల రూ.6500 వేతనం ఇస్తున్నారు. వార్డు సభ్యులకైతే ఎలాంటి వేతనాలు చెల్లించరు.

ప్రజల అవసరాలకు అనుగణంగా..



పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతుల కల్పన కోసం మున్సిపాలిటీ ఏర్పాటు కావాలి. అప్పట్లో పంచాయతీ పాలకవర్గంతో తీర్మానం చేశాం. ప్రస్తుతం పాలకవర్గం ముగిసింది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు పెరుగుతాయి. అభివృద్ధి వేగంగా జరుగుతుంది.

– వెంకటాపూర్ రాజేందర్, తాజా మాజీ సర్పంచ్, ముధోల్

క్లుప్తంగా

వైభవంగా విగ్రహప్రతిష్టాపన


పాల్గొన్న రామారావు పటేల్, విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్

తానూరు: మండలంలోని తొండాల గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాదేవుని ఆలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్టాపన వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావుపటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు పోతారెడ్డి, శివాజీపటేల్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణరావుపటేల్, నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన నీలం సాయినాథ్ కొన్ని నెలల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈమేరకు విద్యుత్ శాఖ తరఫున రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పి.రామారావు పటేల్ సోమవారం మృతుడి కుటుంబీకులకు చెక్కు అందజేశారు. ఏడీఈ ఆదిత్య, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ నాయకులు సుష్మారెడ్డి, రమేశ్, పండిత్ రావ్, మధుకర్, సాయన్న, సాయిబాబా తదితరులు ఉన్నారు.

జొన్న రైతుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కుంటాల: ప్రభుత్వం ఎకరాకు 20 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పెంచికల్‌పాడ్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రభుత్వం ఎకరాకు 8.65 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వాపోయారు. ప్రభుత్వం ఎకరాకు 20 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శ


ప్రేమ్‌సాగర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

సోన్: ఇటీవల దుబాయ్‌లో పాకిస్తాన్ దేశస్తుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ కుటుంబాన్ని మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయనవెంట మాజీ సర్పంచులు వినోద్ కుమార్, లింగన్న నాయకులు ఉన్నారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట జిల్లా ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అంబేకర్ ప్రసాద్, సాయన్న ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన పూజారి పెరుమాండ్ల రమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందా రు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన బాపట్ల ఆశన్న చిన్నకోడలు హేమశ్రీ (22) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, రమేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ, కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌యాదవ్, సురేష్‌రెడ్డి, భాస్కర్, రవికిరణ్ ఉన్నారు.

ఆలయాల వార్షికోత్సవం

మామడ: అనంతపేట్‌లో రాజరాజేశ్వర, కొరిటికల్ గ్రామంలోని దత్తశివసాయి ఆలయాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు హోమం చేపట్టారు. అనంతరం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

రాజ్యాంగం వల్లే అన్నివర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న సుష్మారెడ్డి

భైంసారూరల్: బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి అన్నారు. చలో అభియాన్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాంజ్రి గ్రామంలో సోమవారం దళితుల ఇంట అల్పాహార కార్యక్రమం స్వీకరించి మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రధాని మోదీ కృషిచేస్తున్నారని తెలిపారు. బీజేపీ హయాంలో అన్నివర్గాలకు సమాన న్యాయం కల్పిస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు భూమేశ్, లస్మన్న, పండిత్‌పటేల్, రాందాస్, హన్మాండ్లు, నర్సయ్య, సాయినాథ్, దేవిదాస్, యోగేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని ప్రజావాణి!

- సమయపాలన పాటించని అధికారులు
- నిరీక్షణలో అర్జీదారులు


ఉదయం 11 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమం అపహాస్యమవుతోంది. సమస్యలపై ప్రజల అర్జీలు స్వీకరించేందుకు అధికారులు సరైన సమయానికి రాలేదు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి.. కలెక్టర్ బాసర పర్యటనలో ఉండడంతో ఇతర ఉన్నతాధికారులు రాలేదు. ఉదయం 11.03 గంటలకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.. ప్రజావాణిని ప్రారంభించారు. ఉదయం 11 గంటలవుతున్నా కేవలం 77 మంది శాఖల అధికారులకు 30 మంది హాజరవడం తీవ్ర చర్చనీయాంశమైంది. వారి కోసం అర్జీదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అదనపు కలెక్టర్.. హాజరుకాని వారికి షోకాజ్ నోటీసులు అందించాలని ప్రజావాణి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఉన్నతాధికారుల డుమ్మా..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి శాఖల ఉన్నతాధికారులు విధిగా హాజరుకావాలి. సమయపాలన పాటించాలని రిజిస్టర్ ఏర్పాటు చేశారు. కొందరు జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపిస్తుండటం గమనార్హం. సోమవారం 77 శాఖల జిల్లా అధికారులు గ్రీవెన్స్‌కు హాజరుకావల్సి ఉండగా 55 మంది హాజరయ్యారు. ఇందులో 21 మంది కిందిస్థాయి అధికారులు ఉన్నారు. మరో 22 మంది గైర్హాజరయ్యారు.

ముగ్గురు అధికారులే హాజరు

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదుల విభాగానికి సోమవారం ముగ్గురు అధికారులు హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఐకేపీ సీసీ ముత్యం హాజరుకాగా, మిగిలిన అధికారులు రాలేదు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద 12 గంటలకు ప్రజావాణికి విచ్చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ‘సాక్షి’వివరణ కోరగా ప్రజావాణిలో ఎలాంటి దరఖాస్తులు రాలేవని తెలిపారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

బీఆర్ఎస్ రజోత్సవ సభ విజయవంతం చేయాలి

దస్తురాబాద్: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఐలయ్యయాదవ్ కోరారు. మండలకేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజునాయక్, రాజనర్సయ్య, గోపి, సుధాకర్, లక్ష్మీరాజం, అనిల్, శంకర్, గంగన్న పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్ యువవికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, బ్యాంకర్లతో ఆయన రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో దరఖాస్తులను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, దివ్యాంగులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే ముందు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిపించాలన్నారు. ఒకే గ్రామంలో ఎక్కువమంది ఒకే రకమైన యూనిట్లు పెట్టే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. దీనివలన వ్యాపారంలో పోటీ పెరిగి నష్టాలు వస్తాయన్నారు. ఎంపికైన యూనిట్లకు సంబంధించిన గ్రౌండింగ్ పూర్తయిందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే పైఅధికారులను సంప్రదించాలన్నారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, డీడీఎం నాబార్డ్ వీరభద్రుడు, సంక్షేమ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్

కుంటాల: భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. మండలంలోని ఓలాలోని రైతువేదికలో సోమవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి యోగేష్, రైతులు పాల్గొన్నారు.

తానూరు: భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ లింగమూర్తి సూచించారు. మండలంలోని బోంద్రట్, బోసి, తొండాల, జౌల(బి) గ్రామాల్లో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. గతంలో భూ సమస్యలు పరిష్కరించే అధికారం కలెక్టర్లకు ఉండేదని భూ భారతి చట్టంతో తహసీల్దార్, ఆర్డీవోలకు సవరించే హక్కు కల్పించారన్నారు. రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

సారంగాపూర్: రైతుల భూసమస్యల తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. మండలంలోని జామ్, చించోలి(బి) గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆర్ఐ నర్సయ్య, అధికారులు అరవింద, స్వప్న, రాకేశ్, శేఖన్న, శ్రీకాంత్, రాజలింగు, అశోక్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ సోమవారం రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ రచన, పంచాయతీ కార్యదర్శి రంజిత్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతతో చేపట్టాలి


ఎరువుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న డీపీవో శ్రీనివాస్

సారంగపూర్: ఉపాధి పనులను కూలీలు పూర్తి నాణ్యతతో చేపట్టాలని ఇన్‌చార్జి డీఆర్‌డీవో, డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న కందకాల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు కల్పించిన నీడకోసం టెంట్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మస్టర్లలో హాజరును, గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. గ్రామ పంచాయతీలో తయారు చేసిన ఎరువులను విక్రయాన్ని ప్రారంభించారు. సెగ్రిగేషన్ ఆవరణలో కార్యదర్శులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టీఏ సునీల్, ఎఫ్ఏ శ్రీనివాస్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులనే ఎంపిక చేయాలి


సారంగపూర్‌లో మాట్లాడుతున్న బాలిక్ అహ్మద్

సారంగపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్ అన్నారు. స్థానిక రైతువేదిక భవనంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీల సభ్యులు అర్హుల జాబితా రూపొందించాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కుంటాల: మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, కమిటీ సభ్యులతో ఎంపీడీవో లింబాద్రి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రత్యేకాధికారులు నరేశ్‌గౌడ్, ముత్యం, విక్రమ్, దత్తురాం పటేల్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎంపీడీవో రాధ సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీవో అమీర్‌ఖాన్ ఉన్నారు.

దస్తురాబాద్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులను గుర్తించాలని మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రమేశ్, సహకార సంఘం డైరెక్టర్ చంచు వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్‌కార్మికుల పిల్లలకు అవకాశమివ్వాలి


స్వదేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్న బాధిత కుటుంబీకులు

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి పొందుతున్న జిల్లాకు చెందిన కార్మిక కుటుంబాల వారి పిల్లలకు గురుకుల విద్యాసంస్థల్లో అవకాశం కల్పించాలని ఎన్ఆర్ఐ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల అధికారులకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి విభాగంలో సోమవారం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు పుల్గం రాజేశ్వర్ దుబాయ్ వెళ్లి ఏడాది క్రితం మృతి చెందారు. భార్య పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. భార్య ప్రవళిక కలెక్టరేట్‌లో అధికారులను కలిసి తన కుమారుడు విజ్ఞాన్ ఐదో తరగతిలో గురుకుల విద్యా సంస్థలో సీటు ఇప్పించాలని విన్నవించింది. అనంతరం ఎన్నారై కమిటీ సభ్యులు స్వదేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేయగా.. వచ్చే విద్యా సంవత్సరానికి కల్లా రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసి గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఎన్నారై రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించేలా ప్రయత్నిస్తామన్నారు.

ఖమ్మం జిల్లాలో కవియాత్ర

నిర్మల్‌ఖిల్లా: సామాన్యులను సాహిత్యం దిశగా చైతన్యపర్చేందుకు ‘కవియాత్ర’ కొనసాగిస్తున్నామని కవియాత్ర జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కారెం శంకర్ పేర్కొన్నారు. కవియాత్ర పేరిట ఖమ్మం జిల్లాలో సోమవారం యాత్రను కొనసాగించారు. నేలకొండపల్లి బౌద్ధరామ స్తూపం వరకు యాత్ర కొనసాగించినట్లు కారెం శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సాహితీవేత్తలతోపాటు వర్ధమాన కవులు, రచయితలను సన్మానించినట్లు తెలిపారు. సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్, వికాసవేదిక సాహితీ సంస్థ అధ్యక్షుడు వెంకటస్వామి నాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు గిరి నరసింహారావు, లెనిన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ


ఖానాపూర్‌లో పరిశీలిస్తున్న డీసీవో పాపయ్య

ఖానాపూర్/కడెం: ఖానాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సత్తనపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో, కడెం మండలంలోని కొండుకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీవో పాపయ్య సోమవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం వస్తేనే తూకం వేయాలన్నారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం కడెంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గన్నీ బ్యాగులను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్, మొర్రిగూడెం, నర్సింగాపూర్, చిట్యాల్, లక్ష్మీసాగర్, పాతమద్దిపడగ, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ రమేశ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, మాజీ మండల అధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్, సీఈవో రాజేందర్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఎర్వచింతల్‌లో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వివాదంపై విచారణ చేయాలి

ఖానాపూర్: మండలంలోని రంగపేట పంచాయతీ పరిధి కొత్తగూడెంలో గల ప్లాట్ విషయంలో జరుగుతున్న వివాదంపై విచారణ చేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య ఆధ్వర్యంలో ఎఫ్ఆర్‌వో కిరణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో కలిసి ఈ విషయమై వివాదానికి కారణమవుతున్న వివరాలను తెలియజేశారు. నాయకులు రాజన్న, లచ్చన్న, నారాయణ, శేఖర్, వెంకటేశ్, లింగవ్వ, బుచ్చవ్వ ఉన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించారు

సాక్షి స్పందన


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

తానూరు: మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న హౌసింగ్ కార్యాలయ భవనం ఆవరణలో గ్రంథాలయం ఏర్పాటు చేసి మొక్కలు నాటి ఆహ్లాదంగా పెంచారు. అవి కొద్ది రోజులుగా నీటిని అందించకపోవడంతో ఎండుముఖం పట్టాయి. దీంతోపాటు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ తీరును వివరిస్తూ సాక్షిలో ‘ఆహ్లాదం.. నేడు అధ్వానం’అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందితో గ్రంథాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. మొక్కలకు నీటిని అందించారు. పరిసర ప్రాంతాలను శుభ్రపర్చడంతో గ్రామస్తులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

వినూత్నంగా జంపింగ్ జాక్స్ ఆటలు

బాసర: మండలంలోని కిర్గుల్ (బి) గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు వినూత్నంగా జంపింగ్ జాక్స్ ఆట ఆడారు. మ్యూజిక్‌కు అనుగుణంగా కాళ్లను కదిలిస్తూ అందరూ సమన్వయంతో ముందు ఉన్న గడులలోకి మారుతూ పూర్తి చేయాలి. ఇది ఆట ప్రత్యేకత. హెచ్ఎం నర్సారెడ్డి సరికొత్త ఆటను విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ ఆటవల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు.

జెవిలి, మాచాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సు


జెవిలి గ్రామంలో బస్సు వద్ద గ్రామస్తులు

నిర్మల్‌టౌన్: సారంగాపూర్ మండలం జెవిలి, లక్ష్మణచాంద మండలం మాచాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు పునః ప్రారంభించినట్లు డిపో మేనేజర్ పండరి తెలిపారు. జెవిలి గ్రామానికి మొత్తం మూడు ట్రిప్పులు ఉదయం 8, 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు నిర్మల్ బస్టాండ్ నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. మాచాపూర్‌కు ఉదయం 7 గంటలకు, సాయంత్రం 6:10 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచన మేరకు బస్ సర్వీసులు పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.